సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 19 । జనవరి । 2024



భగ్గుమన్న 'తమ్ముళ్ల' వర్గపోరు

టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. ఆ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం నేతలు బాహాబాహీకి దిగారు. 8లో



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
34.4°/14.1°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చలి తీవ్రత కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష



లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–2025 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 20న తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 34 కేంద్రాల్లో 8,857 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు గురువారం అనంతపురంలోని ఉపాధ్యాయభవన్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

నేడు ఉద్యోగుల స్పందన

పుట్టపర్తి అర్బన్: ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించే ప్రత్యేక ఉద్యోగుల స్పందన కార్యక్రమం నేడు ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో మధ్యాహ్నం 1 గంట వరకూ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సర్వీస్ సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జిల్లా విద్యాధికారి మీనాక్షి

పుట్టపర్తి: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు రెండో విడత కింద జిల్లా విద్యాధికారి మీనాక్షి చేతుల మీదుగా 10,730 బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టులు సులభతరంగా అర్థం కావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.

గ్రౌండ్ వాటర్ ఏడీపై హత్యాయత్నం

- కారంచల్లి.. కత్తులతో దాడి



గాయపడిన ఏడీ రాజశేఖర్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్/హిందూపురం: జిల్లా భూగర్భ జలగణన అధికారిగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి వివరాలమేరకు... ఏడీ రాజశేఖర్‌రెడ్డి బుధవారం రాత్రి సత్యసాయి సూపర్ ఆస్పత్రి సమీపంలోని ఇంటికి చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడ కాపు కాసిన దుండగులు కళ్లలో కారం కొట్టి కత్తులతో దాడి చేశారు. అతను గట్టిగా కేకలు వేయడంతో పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని రాజశేఖర్‌రెడ్డిని ముందుగా సత్యసాయి జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా.. భూగర్భశాఖ రాష్ట్ర డైరెక్టర్ జాన్ సత్యరాజు కక్ష కట్టి తనపై హత్యాయత్నం చేయించారని రాజశేఖర్ రెడ్డి హిందూపురంలో విలేకరులకు తెలిపారు. జాన్ సత్యరాజ్ ఇటీవల రాజకీయ పార్టీ స్థాపించి రూ.5 లక్షల ఫండ్ ఇవ్వాలని తనను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో తనపై హత్యాయత్నం జరిగిందన్నారు. తనకు తన భార్యకు మధ్య విభేదాల కారణంగా విడాకుల వరకు వెళ్లడం జరిగిందన్నారు. జాన్ సత్యరాజు ప్రోత్సాహంతో భార్య బంధువులు దాడి చేశారని ఆరోపించారు. కాగా రాజశేఖర్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దివ్యాంగులు హక్కుల పోరాట సమితి నాయకులు అడిషనల్ ఎస్పీ విష్ణును కలిశారు. నిందితులను అరెస్ట్ చేయాలని సీఐ కొండారెడ్డిని ఎస్పీ విష్ణు ఆదేశించారు.

పేదలకు అండ !

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో పేదల సొంతింటి కల సాకారమవుతోంది. ఇళ్లు కాదు కొత్తగా ఊళ్లనే సృష్టించేలా చర్యలు చేపట్టడంతో ఎంతో మంది పేదలు సంతోషంగా తమ గూళ్లకు చేరుకుంటున్నారు. ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. ఉచితంగా ఇసుక ఇవ్వడంతో పాటు ఇతర సామగ్రిని రాయితీకే అందించారు. అవసరమైన వారికి పావలా వడ్డీకే రుణాలు ఇప్పించడమే కాదు ఆ వడ్డీని సైతం ప్రభుత్వమే భరించింది. ఇందులో భాగంగానే సీఎం వైఎస్ జగన్ వడ్డీ రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి తన నిబద్ధతను చాటుకున్నారు.

- సొంతింటి కల సాకారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఇచ్చిన హామీ మేరకు హౌసింగ్ లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్
- రుణాలివ్వడమే కాకుండా వడ్డీ చెల్లించడంపై అక్కచెల్లెమ్మల హర్షం
- జిల్లాలో 14,420 మందికి రూ.1.58 కోట్లు లబ్ధి



లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ మెగా చెక్కును అందజేస్తున్న జేసీ అభిషేక్ కుమార్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి అర్హులైన హౌసింగ్ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణాలకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ అందించే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ అభిషేక్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఓఎస్‌డీ చంద్రమౌళిరెడ్డి, ఈఈ నాగరాజు, ఏఈలు ప్రవల్లిక, గౌస్‌మోదీన్, హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్ని విధాలా అండగా...

జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా పేద కుటుంబాలకు ఇంటి స్థలాలను మంజూరు చేయడమే కాకుండా ఇంటి నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సహాయం చాలకపోతే అదనంగా బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకే రుణాలను అందిస్తోందన్నారు. సదరు వడ్డీ భారం వారిపై పడకుండా ప్రభుత్వమే భరిస్తూ లబ్ధిదారులందరికీ వడ్డీ మొత్తాన్ని వారికే అందజేస్తోందని చెప్పారు. దీంతో పేదల సొంతింటి కల సాకరమవుతోందని పేర్కొన్నారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేగాక ఇళ్ల నిర్మాణాలు చేపట్టే స్వయం సహాయక బృందాల సభ్యురాళ్లకు రుణాలకు సంబంధించి వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇప్పటికీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని వారంతా పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు.

జిల్లాలో 54,441 మందికి లబ్ధి

జిల్లాలో 54,441 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరంతా స్వయం సహాయక సంఘాల్లో లబ్ధిదారులుగా ఉన్నారు. వారందరికీ రూ.35 వేలు చొప్పున ప్రభుత్వం రూ.191.80 కో +ట్ల రుణాలను అందించింది. ఇందులో మొదటి విడతగా అర్హులైన 14,420 మందికి మొదటి దశ వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.1,58,87,909 నగదు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. గురువారం లబ్ధిదారులతో కలసి జేసీ, హౌసింగ్ అధికారులు మెగా చెక్కును విడుదల చేశారు.

చాలా సంతోషంగా ఉంది



కుటుంబ పోషణతో సతమతమవుతున్న మా కుటుంబానికి ఎనుములపల్లి సమీపంలోని శిల్పారామం కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇంటిని కూడా మంజూరు చేశారు. దీని నిర్మాణానికి అవసరమైన ఇసుక ఉచితంగా , సిమెంటు, స్టీలు ,వాకిళ్లు, కిటికీలు తక్కువ ధరలకే ఇవ్వడంతో త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. ఇప్పటి దాకా అద్దె ఇళ్లలో ఉండి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. జగనన్న మా సొంతింటి కల సాకారం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మేలును ఎన్నటికీ మరువం.

– నాగమణి, లబ్ధిదారురాలు, పుట్టపర్తి

జగనన్నకు రుణపడి ఉంటాం



పూరి గుడిసెలో జీవిస్తున్న మాకు ప్రభుత్వం గ్రామ సమీపంలోనే ఇంటి స్థలాన్ని మంజూరు చేసింది. ఇంటిని మంజూరు చేయడం జగనన్న ఇచ్చిన వరంగా భావిస్తున్నాం. ప్రస్తుతం మా ఇంటి విలువ రూ.10 లక్షలకు పైనే ఉంటుంది. ఇంటి నిర్మాణానికి బ్యాంకు రుణాన్ని ఇప్పించారు. దానికి వడ్డీ సైతం ప్రభుత్వమే భరిస్తుండంతో చాలా సంతోషంగా ఉంది. జీవితాంతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాము.

– అంజినమ్మ, జగరాజుపల్లి హౌసింగ్ కాలనీ

మా కలను సాకారం చేశారు



నా జీవితాశయం అయిన సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. మా గ్రామ సమీపంలో సుమారు 40 ఎకరాల్లో జగనన్న కాలనీని అద్భుతంగా నిర్మిస్తున్నారు. ఒక పెద్ద ఊరులా మారింది. ఎంతో సందడిగా ఉంది. దీంతో పాటు మా కుటుంబానికి అమ్మఒడి, చేయూత, పింఛన్, ఆసరా పథకాలను మంజూరు చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ మమ్మల్ని ఆదుకోలేదు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే ఇంటిని, ప్లాటును మంజూరు చేశారు. జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కలీమున్నీసా, బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీ

31 వరకూ 'గాలికుంటు' నివారణ టీకాలు



గాలికుంటు వ్యాధి సోకిన పశువు

అనంతపురం అగ్రికల్చర్: పశువులకు గాలికుంటువ్యాధి సోకకుండా ఈనెల 31 వరకూ ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ ఎస్. రామచందర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2 నుంచి టీకాల కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 7.04 లక్షల పశువులకు టీకాలు వేయడానికి మందులు సరఫరా చేశామన్నారు. జిల్లా పరిధిలో 3,65,200 పశువులకు గానూ ఇప్పటికే 1,60,748 టీకాలు వేశామని తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 3,39,100కు గానూ 1,06,939 పశువులకు టీకాలు అందించామన్నారు. పశుశాఖ బృందాలు ఆర్‌బీకే వేదికగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి వచ్చిన తరువాత చికిత్స చేయించడం కన్నా నివారణ చర్యలే ముఖ్యమన్నారు. పశువులకు తప్పనిసరిగా చెవిపోగు వేయించాలని, దీంతో ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు కూడా ఉంటాయని తెలిపారు. గాలికుంటు వ్యాధి పాల ఉత్పత్తులపై గణనీయంగా ప్రభావం చూపుతుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగానూ, బలహీనంగా ఉండే యుక్తవయస్సు పశువుల్లో వ్యాధి వేగంగా వ్యాపిస్తుందన్నారు. అధిక జ్వరం, గిట్టల మధ్య పుండ్లు, నోటిలోపల, నాలుక మీద, ముట్టె లోపల భాగంలో బొబ్బలు, మేత మేయకుండా చొంగకార్చడం, గిట్టల మధ్య పుండ్ల కారణంగా సరిగా నడవలేవని తెలిపారు. గర్భంతో ఉన్న పశువులు అబార్షన్‌కు గురి కావడం, పాలిచ్చే ఆవుల్లో ఉత్పత్తి తగ్గడం, పాలుతాగే దూడల్లో మరణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకూ తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు.

నేటి నుంచి కుల గణన సర్వే

- పకడ్బందీగా చేయాలని అధికారులకు జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశం



కులగణన సర్వేపై వీసీ ద్వారా ఆదేశాలు ఇస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకూ కులగణన సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి కులగణన సర్వేపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కులగణన సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 10 రోజుల పాటు జరగనున్న సర్వేలో మొబైల్ యాప్ ద్వారా డోర్ టు డోర్ సర్వే చేయాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, ప్లానింగ్, సంక్షేమశాఖల నుంచి ఎంపిక చేసిన సూపర్ వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు, డివిజన్, జిల్లా అధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తారని వెల్లడించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేస్తారన్నారు. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక యాప్ అందుబాటులోకి వచ్చిందన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తయినట్లు వివరించారు. ప్రజల స్థితి గతులను తెలుసుకోవడానికి కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలు రూపొందించడానికి, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపడతాయన్నారు. అందువల్ల జిల్లాలో కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 19 నుంచి 28 వరకూ ఇంటింటి సర్వే, 29 నుంచి ఫిబ్రవరి 2 వరకూ మిగిలిపోయిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ, ఫిబ్రవరి 15 వరకూ సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ చేయనున్నట్లు తెలిపారు.

23న ఉరవకొండకు సీఎం జగన్

- 'వైఎస్సార్ ఆసరా' నాల్గో విడత నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 23న ఉరవకొండకు రానున్నారు. 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద డ్వాక్రా రుణాల మాఫీకి సంబంధించి నాలుగో విడత సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాక నేపథ్యంలో గురువారం ఉరవకొండలో అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పర్యటించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డితో కలిసి బహిరంగ సభ, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమన్వయంతో ముందుకు సాగి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దామని అధికారులకు పిలుపునిచ్చారు.



ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి తదితరులు

కార్యక్రమానికి తరలివచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏర్పాట్ల పరిశీలనకు త్వరలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉరవకొండకు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ నర్సింగప్ప, ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ పాల్గొన్నారు.

సామాన్యులకు అందలం

- శింగనమల, మడకశిర నియోజకవర్గాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం
- శింగనమలకు ఎం. వీరాంజనేయులు, మడకశిరకు ఈర లక్కప్పకు అవకాశం
- అతి సాధారణ కుటుంబాలకు అవకాశం ఇవ్వడంపై సర్వత్రా హర్షం



వీరాంజనేయులు



ఈర లక్కప్ప

అనంతపురం ఎడ్యుకేషన్: రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త శకానికి నాంది పలికింది. సామాన్యులకు పట్టం కడుతూ అందరికీ అవకాశాలు కల్పిస్తోంది. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లోనే అభ్యర్థుల ఆర్థిక బలాలను పరిశీలించే రాజకీయ పార్టీలున్న ఈ రోజుల్లోనూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలుగా సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారిని గుర్తించి నియమించారు.

సామాజిక విప్లవం

ఇప్పటికే రాజకీయాల్లో సామాజిక విప్లవం తీసుకొచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఇప్పుడు అతి సాధారణ కుటుంబాలను గుర్తించి అందలమెక్కించడం పట్ల అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. గురువారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమిస్తూ నాల్గో విడత జాబితా విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి శింగనమల, మడకశిర రిజర్వ్ నియోజకవర్గాలు ఉన్నాయి. మడకశిర నియోజకవర్గం సమన్వయకర్తగా సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఈరలక్కప్పను నియమించగా, శింగనమల సమన్వయకర్తగా అత్యంత సాధారణ కుటుంబానికి చెందిన ఎం.వీరాంజనేయులును నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలుగా తమకు అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఈర లక్కప్ప, వీరాంజనేయులు అంటున్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ నాయకులు, పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తానని చెబుతున్నారు.

విద్యావంతుడు వీరాంజనేయులు

శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మన్నెపాకుల వీరాంజనేయులు విద్యావంతుడు. ఎంఏ, బీఈడీ పూర్తి చేశారు. సొంతూరు శింగనమల మండలం సి.బండమీదపల్లి. ఈయన తండ్రి ఎం.వెంకటప్ప మాజీ సర్పంచ్, ప్రస్తుతం శింగనమల సింగిల్ విండో డైరెక్టర్‌గా ఉన్నారు. భార్య ప్రమీల నాటక అకాడమీ చైర్‌పర్సన్.

మాజీ సర్పంచ్ ఈర లక్కప్ప

మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఎస్‌ఎల్ ఈర లక్కప్ప సొంతూరు గుడిబండ మండలం పలారం. ఈయన తండ్రి దివంగత లక్కప్ప వ్యవసాయ రైతు. ఈరలక్కప్ప 1989 నుంచి 99 వరకు ఓ స్వచ్ఛంద సంస్థలో టీచరుగా పని చేశారు. 2006 నుంచి 2011 వరకు గుడిబండ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. 2015 నుంచి 2019 వరకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా పని చేశారు. ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

నేటి నుంచి రైతు విజయ సంకల్ప యాత్ర

- నల్లగొండ రిజర్వాయర్ పనులు ప్రారంభించనున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నల్లమాడ: రాయలసీమ కరువు నివారణ పథకం కింద రూ.864 కోట్లతో పైప్‌లైన్, కాలువల ద్వారా నీటిని సరఫరా చేసి నియోజకవర్గంలోని 193 చెరువులకు తరలించనున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని ఎస్.ఎనుమలవారిపల్లి సమీపంలో నల్లగొండ రిజర్వాయర్ నిర్మాణానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించనున్నారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు, పుట్టపర్తి అర్బన్, పుట్టపర్తి రూరల్, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లోని దాదాపు వంద గ్రామాల మీదుగా ఈనెల 27 వరకూ తొమ్మిది రోజుల పాటు 163.1 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగనుంది. చివరి రోజు పుట్టపర్తి రూరల్ మండలంలోని చెర్లోపల్లిలో భారీ బహిరంగ సభతో పాదయాత్ర ముగియనుంది.

తొలిరోజు షెడ్యూల్ ఇలా..

శుక్రవారం ఉదయం 8:30 గంటలకు నల్లగొండ రిజర్వాయర్ పనులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి భూమి పూజ చేస్తారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర ప్రారంభిస్తారు. ఎనుమలవారిపల్లి క్వార్టర్స్, చంద్రాయునిపల్లి క్వార్టర్స్, చంద్రాయునిపల్లి, పాతబత్తలపల్లి, కొత్త బత్తలపల్లి, తోలేటివారిపల్లి, పుల్లగూరపల్లి, కమ్మవారిపల్లి, నల్లసింగయ్యగారిపల్లి, నల్లమాడ, ఎద్దులవాండ్లపల్లి తండా, మూలప్పగారిపల్లి, మసకవంకపల్లి మీదుగా కురుమాల వరకు 20.1 కిలోమీటర్లు మొదటి రోజు పాదయాత్ర జరుగుతుంది. మార్గమధ్యంలో నల్లసింగయ్యగారిపల్లి వద్ద రైతులతోను, ఎద్దులవాండ్లపల్లి తండా వద్ద గిరిజనులతో ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారు. తొలిరోజు రాత్రి కురుమాలలో బస చేస్తారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయవర్గాలు పిలుపునిచ్చాయి.

విస్తృతంగా 'సెబ్' దాడులు

పుట్టపర్తి టౌన్: అదనపు ఎస్పీ విష్ణు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం సెబ్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పుట్టపర్తి సెబ్‌స్టేషన్ పరిధిలో 15, పెనుకొండ సెబ్ స్టేషన్ 50, ధర్మవరం సెబ్ స్టేషన్ 15, కదిరి సెబ్ స్టేషన్ 15, హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలో 150 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వీటిని తరలిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. అలాగే సీకేపల్లి సెబ్ స్టేషన్ పరిధిలో 60 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

వేమన ఆలయంలో పూజలు



గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లిలో వెలసిన యోగి వేమన ఆలయంలో గురువారం ఆలయ పీఠాధిపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేమన జయంతిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున సంతర్పణ చేశారు.

వీరభద్రుడి సేవలో ఇరెడా డైరెక్టర్



ఇరెడా డైరెక్టర్‌ను సత్కరిస్తున్న అర్చకులు

లేపాక్షి: మండల కేంద్రంలో కొలువైన వీరభద్రస్వామిని భారత సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఇరెడా) జాతీయ డైరెక్టర్ డాక్టర్. జగన్నాథ్ సి.జోడిదార్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేయించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. అనంతరం ఏపీ టూరిజం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తమ ప్రాజెక్ట్ ద్వారా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద సోలార్, విండ్‌మిల్, హైడ్రా ఎలక్ట్రిసిటీ , విత్తన ఉత్పత్తి, వేస్ట్, ఎనర్జి లాంటి వాటికి రుణాలు ఇస్తున్నామన్నారు. ఇప్పటికే అనంతపురం, కళ్యాణదుర్గంతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు ఫండింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రధాన మంత్రి కుసుమ్ కింద రైతులు బోర్లకు సౌరశక్తి ఏర్పాటు కోసం రుణం చెల్లించడం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం 33.50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 33.50 శాతం, రైతులు 33 శాతం భరించాల్సి ఉంటుందని వివరించారు. రైతులు సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చారిత్రకారుడు మైనాస్వామి ఆయన వెంట ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సమన్వయకర్త శాంతమ్మ



ఎస్పీ మాధవరెడ్డికి బొకే అందజేస్తున్న శాంతమ్మ

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త జే.శాంతమ్మ ఎస్పీ మాధవరెడ్డిని కలిశారు. గురువారం పుట్టపర్తికి విచ్చేసిన ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీని ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమడగూరు: ఈ నెల 11న మహమ్మదాబాద్ శివారులో చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడిన బావిచెరువుపల్లికి చెందిన బత్తిని శివప్ప బెంగళూరులోని ఆస్పత్రికి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ బలరామయ్య తెలిపారు. మృతుడి అన్న శంకరప్ప ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకులైన వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు ప్రసాద్‌నాయక్

పెనుకొండ: స్థానిక 44వ జాతీయ రహదారిపై పులేకమ్మ గుడి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో సోమందేపల్లి మండలం చల్లాపల్లికి చెందిన ప్రసాద్ నాయక్ (26) దుర్మరణం పాలయ్యాడు. గ్రామానికి చెందిన సుగాలి నాగరాజు, సువర్ణ దంపతుల కుమారుడు ప్రసాద్‌నాయక్ సోమందేపల్లిలో చేనేత కార్మికుడిగా జీవిస్తున్నాడు. గురువారం సాయంత్రం సోమందేపల్లి నుంచి పెనుకొండకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఐదేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన ఐచర్ డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పారిపోయాడు.

భగ్గుమన్న 'తమ్ముళ్ల' వర్గపోరు

- ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో బాహాబాహీ
- ధర్మవరంలో పరిటాల, వరదాపురం వర్గాల తోపులాట
- అనంతపురంలో జేసీ, వైకుంఠం వర్గాల ఘర్షణ
- శింగనమలలో ఒంటరైన బండారు

ధర్మవరం: టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. ఆ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం నేతలు బాహాబాహీకి దిగారు. ముందుగా తమ నేత పూలమాల వేయాలంటే... తమ నేత వేయాలంటూ దూషణలతో రెచ్చిపోయారు. ఉత్కంఠ రాజకీయాలకు కేంద్రమైన ధర్మవరం పట్టణంలోనూ గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు అభాసుపాలు చేశారు. స్థానిక పీఆర్‌టీ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించేందుకు పరిటాల శ్రీరామ్ అనుచరులు చేరుకున్నారు. అదే సమయంలో వరదాపురం సూరి వర్గీయులూ చేరుకోవడంతో వివాదం చెలరేగింది. విగ్రహం వద్దకు చేరుకునేందుకు ఏర్పాటు చేసిన మెట్ల వద్దనే సూరి అనుచరులను పరిటాల వర్గీయులు అడ్డుకున్నారు. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించే హక్కు టీడీపీ నాయకులకే ఉందని బీజేపీ నాయకులకు లేదని సూరిఅనుచరులను పరిటాల వర్గీయులు వెనక్కు నెట్టేశారు. ఆ సమయంలో భారీగా తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకూ సర్ది చెప్పి పంపారు. కాసేపటి తర్వాత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పీఆర్‌టీ సర్కిల్‌కు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిటాల శ్రీరామ్ వెళ్లిపోయిన అనంతరం వరదాపురం సూరి వర్గీయులు వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అనంతపురంలో ఘర్షణ పడుతున్న జేసీ, ప్రభాకరచౌదరి వర్గీయులు



ధర్మవరంలో వరదాపురం సూరి వర్గీయులకు సర్దిచెబుతున్న పోలీసులు

దుర్భాషలతో రెచ్చిపోయిన 'అనంత' తమ్ముళ్లు

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం అనంతపురంలో ఓ వైపు జేసీ వర్గీయులు, మరో వైపు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర చౌదరి వర్గీయులు ఒకరినొకరు తోసుకుని దుర్భాషలతో రెచ్చిపోయారు. దీంతో వివాదం పెద్దదైంది. ఐదేళ్ల కాలం అధికారానికి దూరంగా ఉన్నా వీరిలో మార్పు రాలేదంటూ దీంతో సాధారణ పౌరులు ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం.

చోద్యం చూసిన నేతలు

జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్గాలుగా విడిపోయి కార్యకర్తలు వాదులాడుకుంటున్న సమయంలో సర్ది చెప్పాల్సిన నాయకులు చోద్యం చూశారు. ఓ వర్గం తమపై దాడి చేసిందని పార్టీ అధినేతను కలసి ఫిర్యాదు చేద్దామంటూ మరో వర్గం తీర్మానించగా.. మరో వర్గం పూలమాల వేసి తామే గెలిచామన్న ధీమాతో వెనుదిరిగింది.

బండారు శ్రావణితో కలిసిరాని నేతలు

శింగనమల: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బండారు శ్రావణికి అనమ్మతి వర్గం కలిసి రాలేదు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించేందుకు భారీగా బైక్ ర్యాలీతో తరలిరావాలని నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆమె పిలుపునిచ్చారు. అయితే గురువారం ఉదయం ఆమె వర్గీయులు మాత్రమే బైక్ ర్యాలీగా చేరుకున్నారు. ద్విసభ్య కమిటీగా ఉన్న ఆలం నరసానాయుడు, ముంటిముడుగు కేశవరెడ్డి తమ వర్గీయులతో కలసి బీకేఎస్‌లో ఎన్టీఆర్ చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

గుత్తిలో ఏకంగా మూడు వర్గాల పోరు

గుత్తి: మండల కేంద్రంలో ఏకంగా టీడీపీ నాయకులు మూడు వర్గాలుగా విడిపోయి ఎన్టీఆర్ వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించడంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత కేసీ నారాయణ, మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ వర్గాలుగా కార్యకర్తలు విడిపోయారు. మొదట కేసీ నారాయణ వర్గీయులు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం వెంకటశివుడు యాదవ్, ఆ తర్వాత జితేందర్ గౌడ్ వర్గీయులు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు.

జనవాక్కు

నా బిడ్డకు పునర్జన్మనిచ్చారు



వ్యవసాయం, కూలి పనులతో జీవనం సాగిస్తున్న మాకు ముగ్గురు ఆడ పిల్లల సంతానం. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె మౌనికకు గత ఏడాది జూలైలో ఛాతీలో నొప్పి రావడంతో గుమ్మఘట్ట డాక్టర్ రమేష్ సలహా మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాం. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.1,35 లక్షల విలువైన ఆపరేషన్‌ను ఉచితంగా చేసి ఇంటికి పంపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పక్కాగా అమలు చేస్తూ నా బిడ్డకు పునర్జన్మనిచ్చిన సీఎం వైఎస్ జగనన్న సేవలను ఎన్నటికీ మరువలేను. ఆయనకు రుణపడి ఉంటాం.

– ఏకుల లలితమ్మ, గొల్లపల్లి, గుమ్మఘట్ట మండలం

గౌరవాన్ని పెంచారు



రెండు కాళ్లు ఉన్నా నడవలేని స్థితిలో ఉన్న నాకు వికలాంగుల కోటాలో ప్రతి నెలా రూ.3వేల పింఛన్ అందుతోంది. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు పంచాయతీ కార్యాలయం వద్దకు అతి కష్టంపై చేరుకుని, రోజంతా పడిగాపులు కాసేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి మాకు పింఛన్ అందజేసేలా చేసి మాకు గౌరవ ప్రదమైన జీవనాన్ని సీఎం వైఎస్ జగనన్న అందించారు. ఎవరెన్ని చెప్పినా మా ఓటు మాత్రం జగనన్నకే.

– శశికళ, ఫణారం, గుడిబండ మండలం

మహిళ దారుణహత్య

- నిందితుడు వరదాపురం సూరి ముఖ్య అనుచరుడు
- చీరతో గొంతు బిగించి హత్య చేసిన వైనం

ముదిగుబ్బ: ఆర్థిక లావాదేవీల కారణంగా ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఘటనకు పాల్పడింది ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి ప్రధాన అనుచరుడేనని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరానికి చెందిన ఆదినారాయణ (వరదాపురం సూరి ముఖ్య అనుచరుడు) కొంత కాలంగా అనంతపురానికి మకాం మార్చి, అక్కడి రామ్‌నగర్‌లో నివాసముంటున్న లక్ష్మీదేవి (చీటీల నిర్వాహకురాలు)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆమెకు రూ.5లక్షలు ఇచ్చాడు. అయితే విశ్వనాథ్ అనే వ్యక్తితో ఆమె సన్నిహితంగా ఉండడం గమనించిన ఆదినారాయణ అనుమానాలు పెంచుకున్నాడు. దీంతో తన డబ్బు తిరిగి ఇవ్వాలంటూ తరచూ ఆమెను వేధించడం మొదలు పెట్టాడు. ఈ విషయం లక్ష్మీదేవి ద్వారా తెలుసుకున్న విశ్వనాథ్ ఓ రోజు ఆదినారాయణను తీవ్ర స్థాయిలో మందలించాడు. దీంతో లక్ష్మీదేవిపై కక్ష పెంచుకున్న ఆదినారాయణ ఆమెను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా లక్ష్మీదేవితో సఖ్యతగా ఉంటూ వచ్చాడు. మంగళవారం ఆమెను నమ్మించి తన ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బ మండలం దొరిగిల్లు వద్దకు తీసుకెళ్లాడు. నిర్జన ప్రదేశంలోకి చేరుకోగానే డబ్బు అడిగితే విశ్వనాథ్‌తో బెదిరిస్తావా? అంటూ ఆమె మెడకు చీర బిగించి హతమార్చాడు. ఆమె మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు.



హతురాలు లక్ష్మీదేవి



వరదాపురం సూరితో ఆదినారాయణ (ఫైల్)

మీ అమ్మను చంపేశా

మంగళవారం రాత్రి గడిచినా లక్ష్మీదేవి ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె కుమార్తె నందిని ఆందోళనకు గురైంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆదినారాయణకు ఫోన్ చేసి తన తల్లి గురించి ఆరా తీసింది. ఆ సమయంలో తనకేమీ తెలియదని ఆదినారాయణ తెలపడంతో తన తల్లిని ద్విచక్ర వాహనంపై పిలుచుకుని వెళ్లినట్లుగా చూసిన వారు చెబుతున్నారని, ఆమె ఎక్కడ ఉందో చెప్పాలని గట్టిగా నిలదీసింది. దీంతో 'మీ అమ్మను దొరిగిల్లు ఘాట్‌లో చంపేశా'నంటూ ఆదినారాయణ చెప్పి ఫోన్ కట్ చేశాడు. నందిని నుంచి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ముదిగుబ్బ పోలీసులను సంప్రదించారు. దొరిగల్లు ఘాట్‌కు చేరుకుని లక్ష్మీదేవి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం ఓ నిర్జన ప్రదేశంలో పడి ఉన్న లక్ష్మీదేవి మృతదేహాన్ని గుర్తించారు. సీఐ యతీంద్ర, ఎస్‌ఐ వంశీకృష్ణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. లక్ష్మీదేవి కట్టుకున్న చీరతోనే ఆమె గొంతు బిగించి హతమార్చినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. హతురాలి కుమార్తె నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అజ్ఞాతంలోకి వెళ్లిన ఆదినారాయణ కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.

గొర్రెకు హెర్నియా ఆపరేషన్



శింగనమలలో గొర్రెకు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ పద్మనాభం

గార్లదిన్నె: మండలంలోని తిమ్మంపేట గ్రామ రైతు నల్లపరెడ్డికి చెందిన గొర్రెకు శింగనమల పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం అరుదైన శస్త్రచికిత్స చేసి హెర్నియాను తొలగించారు. నెలరోజుల క్రితం పశువు పొడవడంతో గొర్రె ఉదరంలో కండ తెగి పేగు కొద్దిగా జారిందన్నారు. రోజురోజుకూ అది పెద్దగా మారి ప్రాణాపాయ స్థితికి చేరుకుందన్నారు. రెండు నెలల గర్భంతో ఉన్న గొర్రె పరిస్థితిని గార్లదిన్నె పశువైద్యాధికారి రమేష్ ద్వారా తెలుసుకున్న డాక్టర్ పద్మనాభం గురువారం శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం గొర్రె ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్సలో రజియా బేగం, ఎల్ఎస్ఏ చంద్రశేఖర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

యువతి దుర్మరణం



దెబ్బతిన్న కారు ముందు భాగం



శ్రీదేవి (ఫైల్)

పెనుకొండ రూరల్: స్థానిక 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు.... కర్ణాటక రాజధాని బెంగళూరులోని రామ్మూర్తినగర్‌కు చెందిన శ్రీదేవి (23) బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి యాదగిరిలో దైవదర్శనానికి వెళ్లారు. గురువారం ఉదయం కారులో తిరుగు ప్రయాణమైన వారు పెనుకొండ సమీపంలోని తిమ్మాపురం బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఎదురుగా వెళుతున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. నరసమ్మతో పాటు కారు నడుపుతున్న భీమారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సురేష్‌నాయక్ (ఫైల్)

పెనుకొండ రూరల్: కుటుంబ కలహాలతో విసుగు చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... పెనుకొండ మండలం మునిమడుగు నివాసి సురేష్ నాయక్ (34)... పెనుకొండకు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. దంపతుల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో కొంత కాలంగా ఆమె భర్తకు దూరంగా ఉంటూ వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన సురేష్ నాయక్ బుధవారం రాత్రి గుట్టూరు సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన బొలెరో

- 26 గొర్రెలు మృతి
- తీవ్రంగా గాయపడిన మరో 30 గొర్రెలు



మృతి చెందిన గొర్రెలు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున గొర్రెల మందపై బొలెరో వాహనం దూసుకెళ్లింది. వివరాలు... కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామానికి చెందిన మారెప్ప తనకున్న 500 గొర్రెలను మేపు కోసం గురువారం వేకువజామున బళ్లారి ప్రాంతానికి తోలుకుని బయలుదేరాడు. తెల్లవారు జామున గూబనపల్లి సమీపంలో ప్రధాని రహదారి పక్కనే వెళుతున్న గొర్రెల మందపై రాయదుర్గం నుంచి అనంతపురం వైపు టమాట లోడుతో వెళుతున్న బొలెరో వాహనం దూసుకెళ్లింది. డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. 26 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరోక 30 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఘటన జరిగిన వెంటనే వాహనాన్ని ఆపి డ్రైవర్ పారిపోయాడు. దాదాపు రూ. 6 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు గొర్రెల యజయాని వాపోయాడు. ఈ నష్టాన్ని వాహన యజమాని చెల్లించేలా చొరవ తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు సీఎం జగన్ అండ

- ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

రాయదుర్గం టౌన్: పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలచారని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం బెంగళూరులో మెట్టు గోవిందరెడ్డిని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) ప్రతినిధుల బృందం కలిసి హెచ్‌పీసీఎల్‌లో నెలకొన్న సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చొరవను కొనియాడారు. ప్రభుత్వానికి, మెట్టు గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ సీజీఎం హరిప్రసాద్, జీఎం ఓఅండ్‌డీ గోపాల్‌కృష్ణ, జీఎం ఎస్‌డబ్ల్యూజెడ్ సందీప్‌రెడ్డి, డీజీఎం రాజేంద్రకుమార్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. ఎంతో కాలంగా విజయవాడ హెచ్‌పీసీఎల్ ఆయిల్ టర్మినల్‌కు సంబంధించిన ల్యాండ్ రిజిస్ట్రేషన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి ఏపీఐఐసీ తీసుకెళ్లి పరిష్కారించిన తీరుపై హర్షం వ్యక్తం చేశారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో అనుమతుల విషయంలో జరిగిన జాప్యాన్ని పరిగణలోకి తీసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలధోరణితో సమస్యను పరిష్కరించారన్నారు. ఇది పారిశ్రామికవేత్తల పట్ల ఆయనకున్న స్నేహపూర్వక స్వభావానికి నిదర్శనమన్నారు. పరిశ్రమలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.



మెట్టు గోవిందరెడ్డిని సన్మానిస్తున్న హెచ్‌పీసీఎల్ ప్రతినిధుల బృందం

గ్రామాల అభివృద్ధికి చర్యలు

- జెడ్పీ కొత్త సీఈఓ వైఖోమ్ నిదియా దేవి




అనంతపురం సిటీ: జిల్లాలో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని జిల్లా పరిషత్ కొత్త సీఈఓ వైఖోమ్ నిదియా దేవి తెలిపారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అనంతపురం సీఈఓగా ప్రభుత్వం అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యనిస్తున్నారన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి పనులు చేపడతామన్నారు. గ్రామీణులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అధికారులు, జెడ్పీ పాలకవర్గం, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో స్నేహపూర్వక వాతావరణంలో పని చేసి, ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలబెట్టేందుకు చొరవ చూపుతానని వెల్లడించారు.

స్ఫూర్తిదాయక ప్రస్థానం..

మణిపూర్ రాష్ట్రానికి చెందిన వైఖోమ్ నిదియాదేవి సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చారు. తండ్రి అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. తల్లి నర్సుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రుల ఆశయం మేరకు నిదియాదేవి పట్టుదలతో చదివారు. ఢిల్లీలో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) పూర్తి చేశారు. యూపీఎస్సీ పరీక్షల్లో ఐదో ప్రయత్నంలో విజయం సాధించారు. 2021లో జాతీయ స్థాయిలో 180 ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికై ముస్సోరిలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. నిదియాదేవి భర్త మేఘ స్వరూప్ రెడ్డి కూడా ఐఏఎస్ కావడం గమనార్హం. అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. మణిపూర్ కేడర్‌కు చెందిన ఆమెను స్వాప్ కేటగిరీలో ఆంధ్రకు ప్రభుత్వం కేటాయించింది. ఈ క్రమంలోనే ఆమెను రాష్ట్ర ప్రభుత్వం అనంతపురం జెడ్పీ సీఈఓగా నియమించింది. అనంతపురం జిల్లా పరిషత్ ఆవిర్భవించాక ఇప్పటి వరకూ 57 మంది సీఈఓలుగా పని చేశారు. వారిలో ఐఏఎస్ అధికారులు 8 మంది ఉండగా, వైఖోమ్ నిదియా దేవి 9వ ఐఏఎస్ అధికారి కావడం గమనార్హం.

హోంగార్డులకు చెక్కుల పంపిణీ



హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: వివిధ కారణాలతో ఇటీవల 28 మంది హోంగార్డులు మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎస్పీ అన్బురాజన్ ఆదుకున్నారు. రూ.2.80 లక్షలు విలువ చేసే చెక్కులను వారి వారసులకు గురువారం అందజేశారు. మృతి చెందిన వారి స్థానంలో కారుణ్య నియామకాల కింద విధుల్లో చేరిన కుటుంబ సభ్యులు ఈ చెక్కులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో హోంగార్డులుగా పనిచేస్తూ పలు కారణాలతో 28 మంది మృతి చెందారని గుర్తు చేశారు. బాధిత కుటుంబాల్లోని ఓ సభ్యుడికి కారుణ నియామకం కింద హోంగార్డుగా అవకాశం కల్పించామని, ప్రస్తుతం వీరంతా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. అంత్యక్రియల సమయంలో అయిన ఖర్చులకు సంబంధించిన నగదును చెక్కు రూపంలో చెల్లించినట్లు వివరించారు.

గిరిజనులపై టీడీపీ నేతల దాడి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

కనగానపల్లి: మండలంలోని ముత్తువకుంట్ల తండా గిరిజనులపై టీడీపీ నేతలు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ముత్తువకుంట్ల తండాకు వెళ్లే రహదారి పక్కన చింతచెట్లు ఉన్నాయి. ఏటా ఫలసాయం తండావాసులే తీసుకుంటున్నారు. అయితే బుధవారం ముత్తువకుంట్లకు చెందిన టీడీపీ కార్యకర్త సరిపూటి ఆనంద్, అతని కుమారులు విజయ్‌కుమార్, అజయ్‌కుమార్‌లు చింతకాయలు తెంపుకున్నారు. గమనించిన తండా గిరిజనులు వారికి అడ్డు చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, సరిపూటి ఆనంద్ తన కుమారులతో కలిసి తండాకు చెందిన జగన్నాథ్‌నాయక్‌తో పాటు మరికొందరిని కులంపేరుతో దూషిస్తూ దాడి చేశాడు. ఈ ఘటనలో పలువురు గిరిజనులు గాయపడ్డారు. గురువారం బాధితుడు జగన్నాథ్‌నాయక్ కనగానపల్లికి వెళ్లి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ జనార్దన్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మరోవైపు తమపై దాడి సంఘటనకు సంబంధించి జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు ముత్తువకుంట్ల తండా వాసులు కృష్ణానాయక్, లక్ష్మీనాయక్, వినోద్, జయరాం, వెంకటేష్‌నాయక్ తెలిపారు.



కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ముత్తువకుంట్ల తండావాసులు